సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 14 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.26 వేలు

అనంతపురంవ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.13



నిఘా నీడన ఎన్నికలు

- అనంతపురం జిల్లాలో 1,107 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- 'శ్రీ సత్యసాయి'లో 781 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- ఇప్పటికే చెక్‌పోస్ట్‌ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- లైసెన్స్‌డ్ తుపాకులన్నీ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- సమస్యాత్మక ప్రాంతాల్లో జల్లెడ





సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా వెబ్‌కాస్టింగ్ (వెబ్ కెమెరాల ఏర్పాటు) చేయనున్నారు. అనంతపురం జిల్లాలో మొత్తం 2,213 పోలింగ్ కేంద్రాలుండగా 1,107 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేపట్టాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. శ్రీకాకుళం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తర్వాత ఎక్కువ వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న జిల్లాగా అనంతపురం మూడవ స్థానంలో నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలుండగా, 781 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా ఇట్టే చర్యలు తీసుకునేలా వ్యవస్థకు రూపకల్పన చేశారు. ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుంది. విజయవాడ నుంచి నేరుగా స్థానిక అధికారులకు ఆదేశాలు ఇవ్వవచ్చు.

తుపాకుల స్వాధీనం..

ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సమస్యాత్మక ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. బైండోవర్ కేసు ఉన్న వారు, రౌడీషీటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకులు, రివాల్వర్లు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకింగ్ సేవల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి మినహాయింపు ఇచ్చారు.

కర్ణాటక సరిహద్దు కట్టుదిట్టం

ఉమ్మడి అనంతపురం జిల్లాకు సరిహద్దుగా కర్ణాటక ఉంది. నిత్యం ఇక్కడనుంచి కర్ణాటకకు, కర్ణాటక నుంచి ఉమ్మడి జిల్లాలోకి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ఇక్కడ నిఘా పెంచారు. ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించనున్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. ఈ విషయాలన్నింటిపై రెండు జిల్లాల ఎస్పీలు పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

మరో వైపు అధికారులు కూడా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం అధికారుల నియామకం పూర్తి చేశారు. పోలింగ్ విధులు, ఈవీఎంల పనితీరు, వినియోగం, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల పరిశీలనపై శిక్షణ ఇచ్చారు. మరో వైపు 100 శాతం పోలింగ్ లక్ష్యంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

రాయలసీమ జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఇలా..

జిల్లా	మొత్తం పోలింగ్ కేంద్రాలు	వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నది
కర్నూలు	2,186	1,093
నంద్యాల	1,621	811
అనంతపురం	2,213	1,107
శ్రీసత్యసాయి	1,561	781
అన్నమయ్య	1,607	804
చిత్తూరు	1,762	881
తిరుపతి	2,130	1,065

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం..



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అంతరాష్ట్ర సరిహద్దుల్లో భద్రత పెంచాం. అక్రమంగా మద్యం, డబ్బు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, డీఐజీ

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని, ఈ మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి సీఈఓ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, డీఆర్ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, నియోజక వర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి సీఈఓకు వివరించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన ఫారం 6, 7, 8 అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీ వేగవంతం చేశామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. 85 ఏళ్ల వయస్సు పైబడిన ఓటర్లు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పటిష్టమైన భద్రత మధ్య ఈవీఎంలను నియోజకవర్గాల ప్రధాన కేంద్రాలకు తరలించాలన్నారు. చెక్‌పోస్టుల్లో పటిష్ట భద్రత కొనసాగించాలని ఆదేశించారు. అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్యపరిచేందుకు రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు.

న్యూస్‌రీల్

విషాదంలోనూ పరీక్షకు...

- గుండెపోటుతో తండ్రి మృతి
- పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాసిన విద్యార్థిని



పరీక్ష రాస్తున్న తస్లీమ్

హిందూపురం: భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే తండ్రి అకస్మాత్తుగా దూరమయ్యారు. బాగా చదువుకోవాలన్న తండ్రి మాటలు మనసులో నింపుకున్న కుమార్తె అంతటి విషాదంలోనూ ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆబాద్‌పేటకు చెందిన సిద్ధయ్య (38) పాత్రికేయుడిగా పనిచేసేవారు. మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. గంట ముందు తనతో మాట్లాడిన తండ్రి అంతలోనే కన్నుమూయడంతో కుమార్తె తస్లీమ్ గుండెలవిసేలా రోదించింది. అంతటి దుఃఖంలోనూ బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలన్న తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి. దీంతో బుధవారం హిందూపురంలోని బాలాజీ డిగ్రీ కళాశాల సెంటరులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ పరీక్షకు హాజరైంది. పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాస్తున్న తస్లీమ్‌ను చూసిన వారి హృదయాలు బరువెక్కాయి.

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదలయ్యాయి. ఎంసీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఎంసీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–17) సప్లిమెంటరీ, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–20) , (ఆర్–17) సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–17)సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్ చూడాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు 304 మంది గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ -2, ఎకనామిక్స్-2 పరీక్షకు 304 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ సురేష్ తెలిపారు. జిల్లాలోని 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 8,386 మంది జనరల్ విద్యార్థులు, ఒకేషనల్‌కు సంబంధించి 1,018 మంది హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

నేటి నుంచి గవిమఠం బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన గవిమఠం

ఉరవకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకకు తలమానికంగా ఉన్న ఉరవకొండ గవిమఠం బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకూ చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 15న నాగభరణ ఉత్సవం, 16న నెమలి వాహనోత్సవం, 17న గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి అడ్డపల్లకీ ఉత్సవం, అదే రోజు ఐరావత వాహనోత్సవం, 18న బసవేశ్వర వాహనం, మహాగణారాధన, 19న బ్రహ్మరథోత్సవం ఉంటుంది. 20న లంకాదహనం, 21న అశ్వవాహనోత్సవం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. చలువ పందిళ్లు, తాగునీటి కొళాయిలు, ఉచిత భోజనం, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు.

వైఎస్సార్‌టీయూసీలో ముగ్గురికి చోటు

పుట్టపర్తి: వైఎస్సార్ సీపీ అనుబంధ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీలో ముగ్గురు జిల్లా వాసులకు చోటు దక్కింది. పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎ.రఘునాథరెడ్డి, కార్యదర్శిగా జి.నరేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పి.చెన్నకృష్ణలను నియమించారు.

బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

- 19 నుంచి ఏప్రిల్ 2 వరకూ ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం ఖాద్రీ ఆలయంలో ఈఓ వి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆర్డీఓ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఖాద్రీశుని రథోత్సవానికి లక్షలాది మంది తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు సాగినన్ని రోజులూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు రెవెన్యూ శాఖ నుంచి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆర్డీఓకు సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి ఆచార్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రణీత్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, నాగమల్లి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, పాలకమండలి మాజీ సభ్యులు శివకుమార్, నరసింహారెడ్డి, తలుపుల గంగాధర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భానుడి ఉగ్రరూపం

అనంతపురం అగ్రికల్చర్: భానుడు క్రమక్రమంగా ఉగ్రరూపం దాలుస్తున్నాడు. వేసవి ఆరంభంలోనే సెగలు కక్కిస్తున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి 42 డిగ్రీల దిశగా సాగుతున్నాయి. బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం, చెన్నేకొత్తపల్లిలో ఏకంగా 41.3 డిగ్రీలు నమోదు కావడం వేసవి తీవ్రతకు అద్దం పడుతోంది. అలాగే బత్తలపల్లి, తలుపుల 41.2 డిగ్రీలు, ఆత్మకూరు, పరిగి 40.6 డిగ్రీలు, గుంతకల్లు 40.2 డిగ్రీలు, బుక్కరాయసముద్రం, వజ్రకరూరు 40.1 డిగ్రీలు మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 37 నుంచి 40 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు నాలుగైదు మండలాల్లో 20 నుంచి 22 డిగ్రీల మధ్య ఉండగా చాలా మండలాల్లో 25 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యప్రతాపం కొనసాగుతోంది. మండే ఎండలకు మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

వైఎస్సార్ సీపీతోనే పెనుకొండ అభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- గీతాంజలిది ముమ్మాటికీ టీడీపీ హత్యే
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్

పెనుకొండ: వైఎస్సార్ సీపీతోనే పెనుకొండ అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో పెనుకొండ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందన్నారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెనుకొండ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు అభివృద్ధి చేయడానికి ఎంతో సహకరించారన్నారు. అదేవిధంగా ప్రతి పంచాయతీ పరిధిలో విలేజ్ క్లినిక్, వైఎస్సార్ రైతు భరోసా, సచివాలయం ఏర్పాటు చేసి ప్రజల ముంగిళ్లలోనే సేవలందిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించలేని టీడీపీకి తమ పార్టీని విమర్శించే అర్హతే లేదన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మరోవైపు వంచన రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు..తన స్వార్థం కోసం బీజేపీ, జనసేనతో జతకట్టారన్నారు. అందువల్లే చాలా మంది టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న వైపు నిలబడాలన్న లక్ష్యంతో ఉన్నారన్నారు. ప్రజాభిమానంతో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయ ఢంకా మోగిస్తామన్నారు.

గీతాంజలి మృతికి కారణమైన వారిని శిక్షించాలి

గుంటూరు జిల్లాకు చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉషశ్రీ చరణ్ కోరారు. సీఎం అందించిన సంక్షేమ పథకాలను మనస్ఫూర్తిగా తెలిపిన ఆమెపై పచ్చ పత్రికలు, ఐటీడీపీ, టీడీపీ సోషల్ మీడియా దాడికి తెగబడ్డాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ ట్రోలింగ్ చేసి ఆమె ఆత్మహత్యకు కారకులయ్యారన్నారు. ఆమె ఇద్దరు బిడ్డలకు తీరని శోకాన్ని మిగిల్చారన్నారు. పైగా నారా లోకేష్ బాధిత కుటుంబాన్నే విమర్శించడం ఇంకా దారుణమన్నారు. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారన్నారు. రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు.

రమణీయం.. రథోత్సవం

- వైభవంగా హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం
- వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న భక్త జన సందోహం

అమరాపురం (హేమావతి): మండల పరిధిలోని హేమావతిలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు, శిర, తుమకూరు, చెళ్లకెర, హిరియూర్, పావగడ, చిత్రదుర్గ, దావణగెర తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఉదయమే స్వామివారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వెండి ఆభరణాలతో స్వామివారిని అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలమాలలతో అలంకరించి మేళతాళాలతో రథం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. 'ఓం నమః శివాయా... సిద్ధేశ్వరస్వామి మహారాజ్‌కీ జై, శివహర.. శంభో శంకర' అంటూ అశేష భక్తజనులు కీర్తిస్తుండగా, రథాన్ని ముందుకులాగారు. ఈ సందర్భంగా భక్తులు అరటిపండ్లు, బెల్లం, కొబ్బరికాయ, పూలు, మిరియాలు తదితర వాటిని రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

అకట్టుకున్న వీరగాసే నృత్యం

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం సందర్భంగా కర్ణాటక నుంచి వచ్చిన గురువులు చేసిన వీరగాసే నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీరు, అమెరికాలో స్థిరపడిన విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మడకశిర, హిందూపురం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. సీఐ రాజకుమార్, ఎస్ఐ జనార్దన నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తినుబండారాలు, ఆట వస్తువుల దుకాణాలు కిటకిటలాడాయి.

స్వామి సేవలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి సిద్ధేశ్వరస్వామి సేవలో గడిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన పెద్ద తేరు ఉత్సవాన్ని ఆయన పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క పాల్గొన్నారు.

పూజలు చేసిన ఈర లక్కప్ప

వైఎస్సార్ సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో జరిగిన పెద్ద రథోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. సమన్వయకర్త వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



స్వామి వారి రథోత్సవానికి తరలి వస్తున్న భక్తులు



తిను బండారాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ మండల కన్వీనర్

- మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న లక్ష్మీరెడ్డి
- పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్



లక్ష్మీరెడ్డికి కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. పరిగి మండల టీడీపీ కన్వీనర్ లక్ష్మీరెడ్డి బుధవారం పెనుకొండలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు మంత్రి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. లక్ష్మీరెడ్డి రాకతో పరిగిలో పార్టీ మరింత పటిష్టమవుతుందన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి

రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని లక్ష్మీరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలు, జగనన్న పాలన నచ్చి వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. పార్టీలకు అతీతంగా ఇన్ని సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం వైఎస్ జగనన్న మాత్రమేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని కుయుక్తులు, కుట్రలు చేసినా ఆ పార్టీ గెలవలేదన్నారు. అలాగే పెనుకొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సవిత ఒంటెత్తు పోకడలతో కార్యకర్తలు విసిగిపోయారని, వారంతా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీలో చేరుతారన్నారు. ప్రజలందరి మద్దతుతో పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను మరోసారి ఎగురవేసి వైఎస్ జగన్‌కు కానుకగా ఇస్తామన్నారు. అంతకముందు పరిగిలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి మంత్రి భర్త చరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత ప్రభాకర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, నాయకులు నరేంద్రరెడ్డి, సింగారెడ్డి, అరుణ్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ మారుతీరెడ్డి, శివరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కేటీ అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్య సేవలపై 'టాస్క్‌ఫోర్స్' ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

గాండ్లపెంట: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సేవలపై క్షేత్రస్థాయిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆరా తీసింది. గాండ్లపెంట మండలం సోమయాజులపల్లిలో బుధవారం టాస్క్‌ఫోర్స్ బృందంలోని డీసీహెచ్ఎస్ వీరమ్మ, డీపీఓ నాగరాజు, ఎస్ఓ ఖలందర్, ఐహెచ్ఐపీ సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ తదితరులు పర్యటించారు. గ్రామంలో ప్రసవానంతరం అందిన సేవలను నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీకి చేరుకుని ల్యాబ్, వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రికార్డులు, మందుల నిల్వలు, డీప్ ఫ్రీజర్ల పనితీరును పరిశీలించారు. అధికారుల బృందం వెంట వైద్యాధికారి మహేశ్వరమారుతి, హెచ్ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, పార్వతమ్మ, రవికుమార్, ఫార్మాసిస్ట్ ప్రసాద్, ఎఎన్ఎం షంషూన్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్'కు జిల్లా విద్యార్థి

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థిని ఎంపికైంది. వివరాలు... ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు గుంతకల్లు మండలం కసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జ్యోతి, తన గైడ్ టీచరు నారాయణతో కలసి పాల్గొంది. 'సోలార్ మల్టీ పర్పస్ పోర్టబుల్ టెంట్' అంశంపై తాను రూపొందించిన ప్రాజెక్ట్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడంతో గైడ్ టీచర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్‌తో వివాహానికి చట్టబద్ధత

- ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మ్యారేజ్ సర్టిఫికెట్ సులభంగా పొందేలా చర్యలు



హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సందడి

హిందూపురం అర్బన్: సమాజంలో వివాహానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. పెళ్లంటే నూరేళ్ల పంట. ఆ వివాహానికి చట్టబద్ధత చేయాలనే అంశం చాలామందికి తెలియదు. ఎవరో విదేశాలకు ఉద్యోగాలపై వెళ్లేవారు, ప్రముఖులు మాత్రం చేయించుకునేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. వివాహాల రిజిస్ట్రేషన్‌పై ప్రజలకు ఒక అవగాహన వచ్చింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సులభతరం చేసింది.

గతంలో ఇలా..

గతంలో హిందూ వివాహాలు, ప్రత్యేక వివాహాలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాన్యువల్‌గా నమోదు చేసేవారు. లగ్న పత్రిక, వివాహ ఫొటోలు ఆధార్ కార్డులు, పదో తరగతి సర్టిఫికెట్‌లు, కల్యాణమంటపం రసీదు, ముగ్గురు సాక్షులతో దరఖాస్తు పూర్తి చేసి సబ్‌రిజిస్ట్రార్‌కు ఇచ్చేవారు. వధువుకు 18.. ఆపై, వరునికి 21.. ఆపై వయసు ఉంటే వివాహానికి చట్టబద్ధత ఇస్తూ వచ్చారు. తగిన ఫీజు చెల్లిస్తే సబ్‌రిజిస్ట్రార్ పరిశీలించి ధ్రువీకరణ పత్రం జారీ చేసేవారు.

ఇప్పుడంతా ఆన్‌లైన్

వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పుడు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చారు. www.registrations.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్తే రెండు ఆప్షన్స్ ఉంటాయి. హిందూ వివాహమైతే దానిపై క్లిక్ చేసి మొబైల్ లేదా ఈ మెయిల్ ద్వారా ఓటీపీతో లాగిన్ కావాలి. తదనంతరం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి ఆధార్, ఫొటోలు, పదో తరగతి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. సీఎఫ్ఎంఎస్ ద్వారా ఫీజు చెల్లించాలి. తరువాత ఆన్‌లైన్ దరఖాస్తును సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తే వారు పరిశీలించి సాక్షులతో సంతకాలు పెట్టించుకొని వెంటనే ధ్రువీకరణపత్రం జారీ చేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక వివాహ ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చు. సబ్‌రిజిస్ట్రార్ సాధారణ సంతకం కాకుండా డిజిటల్ సంతకం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫీజు సైతం సులభంగా చెల్లించే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఆధార్ అథెంటికేషన్ ఆన్‌లైన్‌లో పొందే చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక వివాహాల విషయంలో...

హిందూ వివాహ పద్ధతిలో జరగని వాటికి ప్రత్యేక వివాహ రిజిస్ట్రేషన్ దరఖాస్తు విధానంలో మార్పు ఉంటుంది. ఇందుకు నెల రోజులు ముందు దరఖాస్తు చేసుకోవాలి. అభ్యంతరాలు తెలుసుకొనేందుకు నెల రోజులు నోటీసులో ఉంచుతారు. ఎలాంటి అభ్యంతరాలూ లేకపోతే రిజిస్ట్రేషన్ పత్రం జారీ చేస్తారు.

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 21 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాలో 9 మిగిలిన 12 అనంతపురం జిల్లాలో ఉన్నాయి. ప్రతి నెలా సగటున 250–300 రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. ఇది మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

ఆన్‌లైన్‌తో సులభతరం



ఆన్‌లైన్ ద్వారా వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేశారు. వివాహం చేసుకొన్న వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇది వారి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వ పథకాలు, విదేశాలకు వెళ్లే సమయంలో ఈ పత్రం ఉపకరిస్తుంది. జనవరి నుంచి ఆన్‌లైన్ వివాహ రిజిస్ట్రేషన్ విధానం మొదలైంది. వివాహ ధ్రువపత్రాలు పొందాలనుకొనేవారు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని స్లాట్ బుక్ చేసుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించాలి. రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌ద్వారా చెల్లించాలి. వివాహ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– భాగ్యశేఖర్‌రెడ్డి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్, హిందూపురం

మీ సేవా కేంద్రంలో అగ్ని ప్రమాదం



మీ సేవా కేంద్రంలో ఎగిసి పడుతున్న మంటలు

కనగానపల్లి: మండల కేంద్రంలోని మీ సేవా కేంద్రం బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి రూ.లక్షల విలువ చేసే ఎలక్ట్రిక్ పరికరాలు, కంప్యూటర్ సామగ్రి కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. రూ. 30 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు మీ సేవా నిర్వాహకుడు గురుప్రసాద్ వాపోయాడు.

పలు ఇళ్లలో కాలిపోయిన విద్యుత్ పరికరాలు



సచివాలయంలో కాలిపోయిన కుర్చీ

పుట్టపర్తి రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పలు ఇళ్లలో గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. బుధవారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ లైన్‌పై ప్రమాదవశాత్తు ఓ కోతి పడింది. ఘటనతో విద్యుత్ లైన్‌లు రెండు కలిసి హైఓల్టేజ్ ప్రసారమవడంతో ఇళ్లల్లో వినియోగంతో ఉన్న విద్యుత్ ఉపకరణాల నుంచి మంటలు ఎగిసి పడ్డాయి. సచివాయలంలో కుర్చీలు, ఫ్యాన్‌లు, ఇన్వర్టర్లు కాలిపోయాయి. పదుల సంఖ్యలో టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, విద్యుత్ దీపాలు, ఫోన్ చార్జర్లు బుగ్గయ్యాయి. రూ. లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. కాగా, ప్రమాదానికి కారణమైన కోతి విద్యుత్ లైన్‌పై పడగానే పక్కకు ఎగిరిపడి కాసేపు అపస్మారక స్థితిలో ఉండిపోయింది. ఆ తర్వాత కోలుకుని నెమ్మదిగా పక్కకు వైదొలిగింది.

పీఎం సూరజ్ పథకం ప్రారంభం



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖల ఆధ్వర్యంలో నిరుపేదలకు రుణాలు అందజేసే ప్రధాన మంత్రి సూరజ్ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ బుధవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని సందేశాన్ని వీక్షించేందుకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి డీఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్ఓ మాట్లాడుతూ... కేంద్రం అందించిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని సఫాయి కర్మచారులు, పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసే కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలో 147 మందికి రూ.12,74,40522 సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. అలాగే 10 మందికి ఆయుష్మాన్ కార్డులు, పీపీఈ కిట్లు అందజేశారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



కలెక్టరేట్‌లో మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి టౌన్: తొలితరం తెలుగు కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి ఎస్పీ మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సీఐ హేమంత్‌కుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, సిబ్బంది సరస్వతి, నాగరాజు, శివ, షామీర్, శ్రీరాములు, విశ్వతేజ, భార్గవి, మహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జీవితం ఆదర్శం : డీఆర్ఓ

పుట్టపర్తి అర్బన్: విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించిన కవయిత్రి మొల్లమాంబ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని డీఆర్ఓ కొండయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్ఓ కొండయ్య... మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా గోపవరంలో జన్మించిన ఆమె విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, కుమ్మర కులస్తులు వెంకటనారాయణ, నాగరాజు, రామలింగేశ్వర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి



దుండగుల చేతిలో గాయపడిన లోకేష్

హిందూపురం అర్బన్: జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి దండు రోడ్డులో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకొంది. ముదిరెడ్డిపల్లి శివారులో నివాసముంటున్న ఆయన బుధవారం రాత్రి తన మిత్రుడు రఫీక్‌తో కలసి మాట్లాడుతుండగా మూడు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఏడుగురు బీరు బాటిళ్లతో దాడికి తెగబడ్డారు. లోకేష్ తలకు బలమైన గాయమైంది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన రఫీక్‌పై సైతం దుండగులు దాడి చేశారు. స్థానికులు గమనించి అక్కడకు చేరుకుంటుండగా వాహనాలపై దుండగులు ఉడాయించారు. గాయపడిన లోకేష్‌ను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన రఫీక్‌కు ప్రథమ చికిత్స అందజేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. గాయపడి చికిత్సపొందుతున్న లోకేష్‌ను వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.

తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా విజయ్

అనంతపురం సిటీ: జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా యు.విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కర్నూలు రేంజ్ పీఎంజీ(అసిస్టెంట్ డైరెక్టర్) ఉత్తర్వులు జారీ చేశారు. మహారాష్ట్రలోని గోవా రీజియన్‌లో ఏడీ–1గా పని చేస్తున్న ఆయన బదిలీపై హిందూపురానికి రానున్నారు.

యువకుడి దుర్మరణం



మృతుడు దుర్గాప్రసాద్

ధర్మవరం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని లోనికోటకు చెందిన దేవమ్మ, మల్లికార్జున దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ (25) బుధవారం తెల్లవారుజామున చిగిచెర్ల మీదుగా అనంతపురానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కనగానపల్లి మండలం దాదులూరులో జరుగుతున్న జాతరలో పాల్గొనేందుకు సిద్ధమైన ఆయన వాహన వేగాన్ని నియంత్రించుకోలేక చిగిచెర్ల సమీపంలో మలుపు వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెక్‌డ్యాంలోకి దూసుకెళ్లాడు. ఘటనలో కిందపడిన దుర్గాప్రసాద్ తలకు బలమైన కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నవ్య పరిశోధనలతోనే నూతన సమాజం



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు

అనంతపురం: నవ్య పరిశోధనలతోనే నూతన సమాజం సాధ్యమని జేఎన్‌టీయూఏ వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ అంశంపై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ప్రారంభ సదస్సుకు వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో నెలకొన్న సాంకేతిక సమస్యలకు పరిష్కారం ఇవ్వగలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత విద్యా మండలి, బీసీడీఈ(బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్), యునిసెఫ్, విగ్యాన్ ఆశ్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ ల్యాబ్స్‌ను స్థాపించారు. బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఉన్నత విద్య చదివే విద్యార్థులకు అటల్ ల్యాబ్స్‌పైన శిక్షణ ఇవ్వనున్నారు. అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఒక రోజు కురుగుంటలోని ఏపీఆర్ఎస్ స్కూల్‌లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను విద్యార్థులను సందర్శించనున్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, బీసీఈడీ సీఈఓ, సెక్రెటరీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, పర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, యూనిసెఫ్ కన్సల్టెంట్, కోఆర్డినేటర్ సుదర్శన్, విగ్యాన్ ఆశ్రం కార్యక్రమ అధికారి కిషోర్ గైక్వాడ్, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైకోలను శిక్షించాల్సిందే



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు


గుంతకల్లుటౌన్: తన సొంతింటి కలను జగనన్న సాకారం చేశారని చెప్పిన గీతాంజలిని పొట్టనబెట్టుకున్న టీడీపీ, జనసేన సైకోలను కఠినంగా శిక్షించాలంటూ మహిళలు నినదించారు. గీతాంజలి ఆత్మశాంతి కోసం బుధవారం రాత్రి గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి ఆమె చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన కార్యకర్తలు చేసిన ట్రోలింగ్‌తో మనస్తాపం చెందిన గీతాంజలి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. డీజీపీని కలిసి దుండుగులను శిక్షించాలని కోరినట్లు వెల్లడించారు. మహిళల మాన,ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీడీపీ, జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, కౌన్సిలర్లు కెవి.నాగరత్న, సీతావతి, కుమారి, దర్గాచెన్నమ్మ, పాల్గొన్నారు.

గీతాంజలి ఆత్మహత్య బాధాకరం


గుత్తి: తెనాలికి చెందిన గీతాంజలి మృతిపై రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం స్పందించారు. ఆమె ఆత్మహత్య బాధాకరమని అన్నారు. గుత్తిలోని తన కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గీతాంజలి కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం నుంచి తాను పొందిన లబ్ధిపై హర్షం వ్యక్తం చేస్తూ ఓ యూట్యూబ్ చానల్‌తో మాట్లాడిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన నేతలు సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోల్ చేసి ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన గీతాంజలి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. గీతాంజలి మృతికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా ప్రతినిధులపై కేసు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్ష పడేలా చేయాలన్నారు.

పోతలయ్యకు జ్యోతులు

- ఘనంగా దాదులూరు పరుష
- స్వామి దర్శనానికి భారీగా వస్తున్న భక్తులు
- నేడు గావులు ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో పోతలయ్య, చెన్నేకేశవస్వాములు



పోతలయ్యస్వామిని దర్శించుకొనేందుకు వెళ్తున్న భక్తులు

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో వెలసిన పోతలయ్య స్వామికి భక్తులు బుధవారం జ్యోతులు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలోని పోతలయ్య, బంగారు లింగమయ్య, చెన్నేకేశవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జ్యోతులు, బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించారు. సాయంత్రం చుట్టు ప్రక్కల గ్రామాల్లోని ప్రజలు, రైతులు పన్నేరు బండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి వంటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తుండటంతో దాదులూరు పరుష జనసంద్రంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నేడు గావుల మహోత్సవం

దాదులూరు పోతలయ్య స్వామి జాతరలో ప్రధాన ఘట్టమైన గావుల మహోత్సవం గురువారం తెల్లవారుజామున నిర్వహించనున్నారు. పాల్గున శుద్ధ పంచమి గడియల్లో జరిగే ఈ ఉత్సవంలో ఎనిమిది మంది పోతరాజులు మేకపోతుల మెడలను నోటితో కొరికి స్వామివారికి బలి ఇస్తారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. కార్యక్రమం అనంతరం వందలాది పొట్టేళ్లు, మేకపోతులను స్వామికి బలిగా సమర్పిస్తారు.